# సాక్షి
## కుమురం భీం

బుధవారం ; 5 ; మార్చి ; 2025






### కలెక్టర్‌కు కృష్ణఫలాలు
కెరమెరి(ఆసిఫాబాద్): ధనోరాకు చెందిన కేంద్రె బాలాజీ కలెక్టర్ వెంకటేశ్ దోత్రేను కలిశారు. తన ఆపిల్ తోటలో సేంద్రియ పద్ధతిలో పండించిన కృష్ణఫలాలను అందజేశారు.



### రంజాన్ వేళలు
| ఇఫ్తార్ | సహర్ |
|---|---|
| బుధ : 6:19 | గురు : 5:15 |

### వాతావరణం
గరిష్ఠం/కనిష్ఠం
34.0 /17.0

ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుతాయి. వాతావరణం పొడిగా ఉంటుంది. ఆకాశం నిర్మలంగా కనిపిస్తుంది. చలి కాస్త పెరుగుతుంది.

## న్యూస్‌రీల్

### 'ఇందిరమ్మ' పనుల పరిశీలన



నిర్మాణం పరిశీలిస్తున్న డీపీవో భిక్షపతిగౌడ్

సిర్పూర్(టి): మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో చేపట్టిన ఇందిరమ్మ నమూనా ఇంటి నిర్మాణ పనులను డీపీవో భిక్షపతిగౌడ్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లబ్ధిదారులు తక్కువ ఖర్చుతో ఇంటి నిర్మాణం పూర్తి చేసేందుకే నమూనా ఇంటి నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. లబ్ధిదారులు నమూనా ఇంటిని పరిశీలించి నిర్మాణాలు చేపట్టాలని సూచించారు. డీపీవో వెంట ఎంపీడీవో సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి తిరుపతి, సిబ్బంది ఉన్నారు.

### డీఎంపై చర్య తీసుకోవాలి
**ఆసిఫాబాద్‌అర్బన్:** ఆర్టీసీ ఆసిఫాబాద్ డిపోలో పని చేస్తున్న కార్మికులను వేధిస్తున్న డీఎం విశ్వనాథ్‌పై చర్యలు తీసుకోవాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు దివాకర్ కోరారు. ఈ మేరకు మంగళవారం హైదరాబాద్‌లోని బస్‌భవన్‌లో కార్మికులతో కలిసి టీజీఎస్ ఆర్టీసీ ఎండీ కార్యాలయంలో ఈడీ మునీశ్వర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా దివాకర్ మాట్లాడుతూ.. కొంత కాలంగా డీఎం కార్మికులపై అధిక పనిభారం మోపుతూ వేధింపులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. కార్మికులు పని ఒత్తిడి తట్టుకోలేక అనారోగ్యానికి గురవుతున్నారని తెలిపారు. కార్మికులకు క్యాజువల్ లీవ్‌లు కూడా ఇవ్వడం లేదని పేర్కొన్నారు. ఆసిఫాబాద్ నుంచి హైదరాబాద్‌కు వెళ్లే సర్వీసులను నడిపితే మూడు రోజుల పని దినాలను రెండు రోజులకు కుదించేందుకు కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. పని చేయని యంత్రాల ద్వారా డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు నిర్వహిస్తూ కార్మికులపై తప్పుడు నివేదికలు ఇచ్చి సస్పెన్షన్, తొలగింపు కుట్రకు పాల్పడుతున్నారని విమర్శించారు. డీఎం, ఆర్ఎం చర్యలపై విచారణ చేపట్టి చర్య తీసుకోవాలని కోరారు. లేని పక్షంలో బస్‌భవన్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు.

### ఉత్తమ ఫలితాలు సాధించాలి
**ఆసిఫాబాద్‌రూరల్:** పదోతరగతి వార్షిక పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని డీటీడీవో రమాదేవి సూచించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో నిర్వహించిన సబ్జెక్టు టీచర్ల శిక్షణ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. పదో తరగతి పరీక్షలు సమీపిస్తున్నందున విద్యార్థులను సన్నద్ధం చేయాలని సూచించారు. జిల్లాలో 36 ఆశ్రమ పాఠశాలల్లో 1,255 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. జిల్లాలో గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు మంచి మార్కులు సాధించేలా సబ్జెక్టు టీచర్లు కృషి చేయాలని, వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. 100 శాతం ఫలితాలు సాధించే దిశగా ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని తెలిపారు. ఏసీఎంవో ఉద్ధవ్, డీఎస్వో మీనారెడ్డి, ఏటీడీవో చిరంజీవి, ఎస్వో సంతోష్, సాగర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### స్పోర్ట్స్ స్కూల్‌లో ప్రవేశం కోసం ఎంపిక పోటీలు
**ఆసిఫాబాద్‌రూరల్:** గిరిజన ఆదర్శ క్రీడాపాఠశాలలో ఐదోతరగతిలో ప్రవేశం కోసం గిరిజన విద్యార్థులకు ఈ నెల 6వ తేదీన జిల్లా కేంద్రంలోని ఆదర్శ క్రీడాపాఠశాలలో ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, ఐటీడీఏ పీవో కుష్బూ గుప్తా మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి, అర్హత గలవారు నాలుగో తరగతి చదువుతూ 01.09.2016 నుంచి 31.08.2017 మధ్య జన్మించి ఉండాలని పేర్కొన్నారు. 5 నుంచి 9వ తరగతి వరకు బ్యాక్‌లాగ్ సీట్లు భర్తీ చేయనున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు డీఎస్వో మీనారెడ్డిని 9440010453 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

### సమస్యల పరిష్కారానికే గ్రామాల్లో పొలం బాట
**ఆసిఫాబాద్‌అర్బన్:** జిల్లాలోని విద్యుత్ సమస్యలు పరిష్కరించి వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్ అందించేందుకే 'పొలం బాట' నిర్వహిస్తున్నట్లు ఆసిఫాబాద్ సర్కిల్ ఎస్‌ఈ రాథోడ్ శేషారావ్ తెలిపారు. పొలం బాట కార్యక్రమంలో సేవలందించిన అధికారులు, సిబ్బందిని ఆయన మంగళవారం జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సర్కిల్ పరిధిలో ఇప్పటివరకు 36 వంగిన స్తంభాలు, 43 లూజ్‌లైన్లు, 14 మధ్య స్తంభాలు సరి చేసినట్లు తెలిపారు. ఆటో స్టార్టర్లు తొలగించాలని రైతులకు సూచిస్తున్నట్లు తెలిపారు. రైతులకు ఎలాంటి సమస్య తలెత్తినా 1912 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు.

# విజయీభవ



- నేటి నుంచి ఇంటర్ పరీక్షలు షురూ
- ఐదు నిమిషాలు ఆలస్యమైనా ఎంట్రీ
- హాజరు కానున్న 10,054 మంది
- ఏర్పాట్లు పూర్తిచేసిన అధికారులు

**ఆసిఫాబాద్‌రూరల్:** ఇంటర్ పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. పరీక్షల నిర్వహణకు జిల్లాలో 19కేంద్రాలు ఏర్పాటు చేశారు. 10,054 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు. ఇందులో 4,756 మంది ఫస్టియర్, 5,287 మంది సెకండియర్ విద్యార్థులున్నారు. పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా ఇంటర్మీడియట్ అధికారి కళ్యాణి వెల్లడించారు. పరీక్షలు రాసే విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు రానివ్వబోమని తెలిపారు. అన్ని కేంద్రాల్లో బెంచీలు, తాగునీరు, ఫ్యాన్లు, మూత్రశాలలు తదితర వసతులు కల్పించినట్లు పేర్కొన్నారు. మాస్ కాపీయింగ్‌కు తావు లేకుండా ప్రతీ పరీక్షాకేంద్రంలో ఐదు సీసీ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేసినట్లు వివరించారు.

**పరీక్షాకేంద్రాల వద్ద బందోబస్తు**
**ఆసిఫాబాద్‌అర్బన్:** జిల్లాలో ఏర్పాటు చేసిన ఇంటర్ పరీక్షాకేంద్రాల వద్ద 163 బీఎన్ఎస్ఎస్ అమలు చేస్తున్నట్లు ఎస్పీ శ్రీనివాస్‌రావ్ ఓ ప్రకటనలో తెలిపారు. కేంద్రాల వద్ద పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. కేంద్రాల సమీప జిరాక్స్, ఇంటర్‌నెట్ సెంటర్లు మూసి ఉంచాలని పేర్కొన్నారు. పట్టణంలో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

**ఐదు నిమిషాలు ఆలస్యమైనా..**
ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలకు 'నిమిషం' నిబంధన తొలగించారు. పరీక్ష ప్రారంభమైన తర్వాత ఐదు నిమిషాలు అంటే ఉదయం 9.05 గంటల వరకు విద్యార్థులను కేంద్రాల్లోకి అనుమతిస్తారు. నిబంధనల ప్రకారం ఉదయం 8.45 గంటల నుంచి 9గంటల మధ్యలో ఓఎంఆర్ పత్రాన్ని విద్యార్థులు పూర్తి చేయాల్సి ఉంటుంది. ఎవరికి వారు తమకిచ్చిన పత్రంపై తమ వివరాలే ఉన్నాయా? లేదా? అని సరిచూసుకోవాల్సి ఉంటుంది. కాబట్టి విద్యార్థులు నిర్దిష్ట సమయానికంటే ముందే పరీక్షాకేంద్రాలకు చేరుకోవడం మంచిది.

**సీసీ కెమెరాల పర్యవేక్షణలో..**
ఇంటర్ బోర్డు కార్యదర్శి ఆదేశాల మేరకు ఈసారి సీసీ కెమెరాల నిఘాలో పరీక్షలు నిర్వహించనున్నారు. ఇప్పటికే అన్ని పరీక్షాకేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. వీటితో పాటు ఎప్పటికప్పుడు ప్రత్యేక స్క్వాడ్స్‌తో కేంద్రాలను తనిఖీ చేయనున్నారు. మాస్ కాపీయింగ్‌కు ఆస్కారం లేకుండా పరీక్షలు పకడ్బందీగా నిర్వహించనున్నారు. ఇంటర్ బోర్డు కార్యాలయంలో కమాండ్ కంట్రోల్ సెంటర్ (సీసీసీ)ని ఏర్పాటు చేశారు. దీంతో ప్రతీ పరీక్షాకేంద్రం కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానం చేసి ఉంటుంది. పరీక్షల నిర్వహణకు 19 కేంద్రాల్లో 192 మంది ఇన్విజిలేటర్లు, 19 మంది సీఎస్‌లు, 19 మంది డీవోలతోపాటు రెండు సిట్టింగ్ స్క్వాడ్, ఒక ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను నియమించారు. కలెక్టర్, అదనపు కలెక్టర్ కూడా పరీక్షాకేంద్రాలను పర్యవేక్షించనున్నారు. ఆయా కేంద్రాల వద్ద 163 సెక్షన్ అమలులో ఉంటుంది. ప్రతీ సెంటర్‌కు ఇద్దరు పోలీస్ సిబ్బంది అందుబాటులో ఉంటారు. కేంద్రానికి సమీపంలోని జిరాక్స్, ఇంటర్‌నెట్ సెంటర్లను పరీక్ష ముగిసేదాకా మూసి ఉంచాలని అధికారులు ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు.



ఆసిఫాబాద్ బాలుర గురుకులంలో హాల్‌టికెట్ నంబర్లు వేస్తున్న అధికారులు

**జిల్లాలోని పరీక్షాకేంద్రాల వివరాలు**

| ప్రాంతం | పరీక్షాకేంద్రం పేరు |
|---|---|
| ఆసిఫాబాద్ | ప్రభుత్వం జూనియర్ కళాశాల |
| ఆసిఫాబాద్ | గిరిజన గురుకుల బాలుర పాఠశాల |
| ఆసిఫాబాద్ | సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల |
| ఆసిఫాబాద్ | గిరిజన బాలికల గురుకుల పాఠశాల |
| వాంకిడి | ప్రభుత్వ జూనియర్ కళాశాల |
| కెరమెరి | ప్రభుత్వ జూనియర్ కళాశాల |
| రెబ్బెన | ప్రభుత్వ జూనియర్ కళాశాల |
| కాగజ్‌నగర్ | ప్రభుత్వ జూనియర్ కళాశాల |
| కాగజ్‌నగర్ (గన్నారం) | ఎంజేపీ పాఠశాల |
| కాగజ్‌నగర్ | వివేకానంద జూనియర్ కళాశాల |
| కాగజ్‌నగర్ | వసుంధర్ జూనియర్ కళాశాల |
| కాగజ్‌నగర్ | ప్రభుత్వ డిగ్రీ కళాశాల |
| కౌటాల | ప్రభుత్వ జూనియర్ కళాశాల |
| జైనూర్ | ప్రభుత్వ జూనియర్ కళాశాల |
| బెజ్జూర్ | ప్రభుత్వ జూనియర్ కళాశాల |
| దహెగాం | ప్రభుత్వ జూనియర్ కళాశాల |
| సిర్పూర్(యూ) | తెలంగాణ మోడల్ స్కూల్ |
| సిర్పూర్(టి) | ప్రభుత్వ జూనియర్ కళాశాల |
| తిర్యాణి | ప్రభుత్వ జూనియర్ కళాశాల |

**నిర్భయంగా పరీక్ష రాయాలి**



ఇంటర్ పరీక్షల నిర్వహణకు జిల్లాలో 19 పరీక్షాకేంద్రాలు ఏర్పాటు చేశాం. ప్రతీ కేంద్రంలో అన్ని రకాల వసతులు కల్పించాం. సీసీ కెమెరాల పర్యవేక్షణలో పరీక్షలు నిర్వహిస్తున్నాం. విద్యార్థులు అరగంట ముందే కేంద్రాలకు చేరుకుని నిర్భయంగా పరీక్షలు రాయాలి.
– కళ్యాణి, డీఐఈవో

# బీజేపీలో జోష్



ఆసిఫాబాద్ అర్బన్: జిల్లా కేంద్రంలో పటాకులు కాలుస్తున్న బీజేపీ నాయకులు

- ఎమ్మెల్సీ ఫలితాలతో నాయకులకు ఊరట
- పట్టభద్రుల స్థానంలోనూ గెలుస్తామనే ధీమా
- ఉమ్మడి జిల్లాలో పార్టీ కేడర్‌లో ఉత్సాహం

**సాక్షి ప్రతినిధి, మంచిర్యాల:** టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం కమలనాథుల్లో జోష్ నింపింది. ఉమ్మడి మెదక్, కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్ నియోజకవర్గ ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ స్థానాన్ని కైవసం చేసుకోవడం ఆ పార్టీ శ్రేణులకు కొత్త ఉత్సాహాన్ని ఇచ్చింది. ఎమ్మెల్సీ పోరులో నువ్వా.. నేనా.. అన్నట్లు తలపడగా.. బీజేపీ బలపర్చిన అభ్యర్థి మల్క కొమురయ్యకే టీచర్లు పట్టం కట్టారు. ఉమ్మడి జిల్లాలో గత అసెంబ్లీ ఎన్నికల్లో తొలిసారిగా నాలుగు ఎమ్మెల్యే స్థానాలను బీజేపీ గెలుచుకుంది. ఆ తర్వాత లోక్‌సభ ఎన్నికల్లోనూ ఆదిలాబాద్ సిట్టింగ్ స్థానాన్ని గెలుచుకుని మరోసారి సత్తా చాటింది. తాజాగా ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీచర్ల మద్దతుతో ఓ సీటులో విజయం సాధించింది. దీంతో ఉత్తర తెలంగాణలో కీలకమైన ఎమ్మెల్సీ సైతం ఆ పార్టీ ఖాతాలో చేరింది. ఉమ్మడి జిల్లాలో గత రెండేళ్లుగా బీజేపీ అనుకూల పవనాలే వీస్తున్నాయి. దీంతో భవిష్యత్‌లో తమ పార్టీ బలపడుతుందనే సంకేతాలు వస్తున్నాయని కేడర్‌లో ఉత్సాహం నెలకొంది. గత కొంతకాలంగా పార్టీ పుంజుకోవడంపై ఎన్నో ఏళ్లుగా ఇక్కడ పాగా వేయాలనుకున్న పార్టీ సీనియర్లకు ఊరట కలుగుతోంది. మరోవైపు తాజా ఎన్నికలతో యువత, టీచర్లు, విద్యావంతులు బీజేపీ వైపు ఉన్నారని ఆ పార్టీ శ్రేణులు చెప్పుకొంటుండటం గమనార్హం.

**కలిసొచ్చిన ఆత్మీయ సమ్మేళనాలు**
ఎమ్మెల్సీ ఎన్నికలను బీజేపీ ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని ఆది నుంచి విస్తృతంగా ప్రచారం చేసింది. పట్టభద్రులు, టీచర్ల స్థానానికి అభ్యర్థులను బరిలో దింపి స్థానిక నాయకులపైనే భారం వేసింది. కార్పొరేట్ వ్యక్తులుగా ప్రచారం జరిగినా మల్క కొమురయ్య, పట్టభద్రుల స్థానానికి అంజిరెడ్డికి సానుకూలత పెరిగింది. పట్టణాలు, నియోజకవర్గాల్లో ఓటర్లను అధికసంఖ్యలో రప్పించి ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించడం గెలుపునకు దోహదం చేశాయి. ముందుగా అభ్యర్థిని ప్రకటించడం కలిసిసొచ్చింది.

**వచ్చే స్థానిక సంస్థల్లోనూ..**
ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ సత్తా చాటేందుకు ఆ పార్టీ సిద్ధమవుతోంది. ఇప్పటికే కొత్త జిల్లాల అధ్యక్షులు, నియోజకవర్గ, మండల, పట్టణ, గ్రామాలు, బూత్ స్థాయిలో బాధ్యతలు అప్పగించారు. పట్టణాలకే పరిమితమైన ఓటు బ్యాంకును గ్రామాల్లోకి తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తున్నారు. మరోవైపు ఉమ్మడి జిల్లా నుంచి నిర్మల్, ఆదిలాబాద్, సిర్పూర్ స్థానాల్లో ఉన్న ఎమ్మెల్యేలు కూడా రాష్ట్ర రాజకీయాల్లో కీలకంగా వ్యవహరిస్తున్నారు. దీంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కాషాయ పార్టీ బలపడేందుకు సరైన సమయం వచ్చిందని కార్యకర్తలు భావిస్తున్నారు. ఇన్నాళ్లు పట్టణాలకే పరిమితమైన పార్టీ ఇక గ్రామ స్థాయిలోనూ విస్తరిస్తుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

**మరో సీటుపై ఉత్కంఠ**
మరోవైపు పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి గత రెండు రోజులుగా లెక్కింపు ప్రక్రియ కొనసాగుతోంది బీజేపీ అభ్యర్థి అంజిరెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డి, బీఎస్పీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణ మధ్య పోటీ కనిపిస్తోంది. అభ్యర్థులు, ఓట్లు ఎక్కువగా ఉండడంతో లెక్కింపు నెమ్మదిగా సాగుతోంది. ప్రధానంగా కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థుల మధ్య పోటీ నడుస్తోంది. బీజేపీ అభ్యర్థి మంగళవారం సాయంత్రం వరకు ముందంజలో ఉన్నారు. ఏ అభ్యర్థి గెలుస్తారనేది బుధవారం స్పష్టత రానుంది. ఓట్ల లెక్కింపులో ప్రాధాన్యత క్రమంలో అభ్యర్థుల తొలగింపు ప్రక్రియ మొదలైతే తుది విజేత ఎవరనేది తేలాల్సి ఉంది. బీజేపీ శ్రేణులు మాత్రం తమ అభ్యర్థి గెలుస్తారనే ధీమాలో ఉన్నారు.

# 'పది'లో పాత విధానమే..!

- వార్షిక పరీక్షల్లో 'గ్రేడింగ్' రద్దు
- మార్కుల విధానం మళ్లీ అమలు
- సవరణలు చేసిన విద్యాశాఖ

**ఆసిఫాబాద్‌అర్బన్:** ఈనెల 21వ తేదీ నుంచి ఏప్రిల్ 2వరకు నిర్వహించనున్న పదో తరగతి వార్షిక పరీక్షల విధానంలో విద్యాశాఖ పలు మార్పులు చేసింది. ఇప్పటివరకు ఉన్న గ్రేడింగ్ (జీపీఏ) విధానాన్ని రద్దు చేసింది. పూర్వ పద్ధతిలోనే మార్కుల విధానాన్ని అమల్లోకి తెచ్చింది. అలాగే నాలుగు పేజీల జవాబు పత్రాల స్థానంలో 24పేజీల బుక్‌లెట్ ఇవ్వాలని నిర్ణయించింది. విద్యార్థులకు సరిపడా బుక్‌లెట్లు ఇప్పటికే జిల్లాకు చేరుకున్నట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు. జిల్లాలో 36 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయగా, 6,421 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు.

**నాలుగు చోట్ల రిసీవింగ్ కేంద్రాలు**
జిల్లాలోని ఆసిఫాబాద్, కాగజ్‌నగర్, జైనూర్, కౌటాలలో రిసీవింగ్ సెంటర్లు ఏర్పాటు చేసినట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు. ఇప్పటికే ఈ కేంద్రాలకు 24 పేజీలు కలిగిన ఆన్సర్ బుక్‌లెట్లు చేరుకుంటున్నట్లు పేర్కొన్నారు. పరీక్షల సమయంలో సీఎస్ పర్యవేక్షణలో రిసీవింగ్ సెంటర్ల నుంచి ప్రశ్నాపత్రాలతో పాటు ఆన్సర్ బుక్‌లెట్లను పరీక్షాకేంద్రాలకు తరలించనున్నారు. ప్రతీ 20 మంది విద్యార్థులకు ఒక ఇన్విజిలెటర్‌తో పాటు ప్రతీ పరీక్షా కేంద్రంలో సిట్టింగ్ స్క్వాడ్, మెడికల్ సిబ్బంది, సీఎస్ విధులు నిర్వహించనున్నారు. మాస్ కాపీయింగ్‌కు తావు లేకుండా పకడ్బందీ చర్యలు చేపడుతున్నారు.



**జిల్లాకు సంబంధించిన వివరాలు**

ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు : **172**

పదో తరగతి పరీక్షా కేంద్రాలు : **36**

హాజరు కానున్న విద్యార్థులు : **6,421**

**ప్రభుత్వ ఉత్తర్వుల మేరకే..**
రాష్ట్ర విద్యాశాఖ ఈ సంవత్సరం పదోతరగతి పరీక్షా విధానంలో నూతన మార్పులు చేసింది. గ్రేడింగ్ విధానాన్ని రద్దు చేసి పాత పద్ధతిలో మార్కుల విధానాన్ని అమలు చేస్తోంది. జవాబు పత్రాల స్థానంలో 24 పేజీల బుక్‌లెట్ ఇవ్వాలని నిర్ణయించింది. విద్యాశాఖ ఉత్తర్వుల మేరకు పరీక్షల నిర్వహణకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నాం.
– ఎం.ఉదయ్‌బాబు, జిల్లా పరీక్షల సహాయాధికారి

# నిరుపేదల కోసమే వైద్యశిబిరాలు

- జిల్లా అటవీ అధికారి నీరజ్‌కుమార్
- బెజ్జూర్‌లో హెల్త్‌క్యాంప్ ప్రారంభం



శిబిరాన్ని పరిశీలిస్తున్న నీరజ్‌కుమార్

**బెజ్జూర్:** నిరుపేదల కోసమే అటవీశాఖ, సింగరేణి ఆధ్వర్యంలో వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా అటవీశాఖ అధికారి నీరజ్‌కుమార్ పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని అటవీశాఖ క్షేత్ర అధికారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని కాగజ్‌నగర్ డివిజన్ అధికారి సుశాంత్ సుగ్దేవ్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం డీఎఫ్‌వో మాట్లాడుతూ.. జిల్లాలోని మారుమూల మండలంలో వైద్యశిబిరం నిర్వహణకు సింగరేణి సంస్థ ముందుకు రావడం అభినందనీయమన్నారు. డబ్బులు లేక వైద్యం చేయించుకోలేని నిరుపేదల కోసం వైద్యశిబిరం ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. అన్ని రకాల వైద్యనిపుణులతో శిబిరంలో సేవలందిస్తున్నట్లు పేర్కొన్నారు. బుధవారం కూడా శిబిరం కొనసాగుతుందని, మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రాబోవు రోజుల్లో నెలకోసారి ఆయా మండలాల్లో వైద్యశిబిరాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మండల వ్యాప్తంగా రోగులు భారీసంఖ్యలో వచ్చి శిబిరంలో పరీక్షలు చేయించుకుని మందులు పొందారు. సింగరేణి సంస్థ సూపరింటెండెంట్ మధుకుమార్, వైద్యులు రాధాకృష్ణ, స్టాలిన్, శ్రీదేవి, బెజ్జూర్ ఎఫ్ఆర్వో ముసవీర్, సెక్షన్ అధికారులు శ్రావణ్‌కుమార్, మల్లికార్జున్, బీట్ అధికారులున్నారు.

# తేలని ఫలితం
# వీడని ఉత్కంఠ

- 'గ్ర్యాడ్యుయేట్' పోటీ త్రిముఖం
- కోటా ఓట్ల మార్కును చేరుకోని అభ్యర్థులు
- ఎలిమినేషన్ ప్రక్రియతోనే తేలనున్న ఎమ్మెల్సీ ఫలితం
- ప్రస్తుతం ఆధిక్యంలో బీజేపీ అభ్యర్థి అంజిరెడ్డి



కరీంనగర్‌లోని అంబేడ్కర్ ఇండోర్ స్టేడియంలో ఓట్లు లెక్కిస్తున్న సిబ్బంది

**సాక్షి,పెద్దపల్లి:** ఉమ్మడి కరీంనగర్– ఆదిలాబాద్– మెదక్– నిజా మాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఫలితం ఉత్కంఠ రేపుతోంది. కరీంనగర్‌లోని అంబేడ్కర్ స్టేడియం కౌంటింగ్ కేంద్రంలో మంగళవారం అర్ధరాత్రి వరకు జరిగిన కౌంటింగ్‌లో బీజేపీ, కాంగ్రెస్, బీఎస్పీ అభ్యర్థులు పోటాపోటీగా ఓట్లు సాధించారు. ఎవరూ నేరుగా కోటా ఓట్లు చేరుకునే అవకాశాలు కనిపించడం లేదు. మొదటి ప్రాధాన్యత ఓట్లతో ఫలితం తేలకపోవడంతో రెండో ప్రాధాన్యత ఓట్లపై ఆసక్తి నెలకొంది. మొత్తం చెల్లుబాటైన ఓట్ల లెక్కింపు పూర్తయ్యాక ఎలిమినేషన్ ప్రక్రియ ద్వారా ఫలితం తేలనుంది. దీంతో ట్రయాంగిల్‌గా సాగుతున్న ఎమ్మెల్సీ ఎన్నికల పోరు సర్వత్రా ఆసక్తి రేపుతోంది.

**త్రిముఖ పోటీ..**
పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో 56 మంది అభ్యర్థులు పోటీపడినా.. ప్రధానంగా బీజేపీ అభ్యర్థి అంజిరెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డి, బీఎస్పీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణ విస్తృత ప్రచారం చేశారు. దానికి అనుగుణంగానే ఈ ముగ్గురికి పోటాపోటీగా ఓట్లు వచ్చాయి. 6వ రౌండ్ పూర్తయ్యే సమయానికి బీజేపీ, కాంగ్రెస్, బీఎస్పీ అభ్యర్థులు ముగ్గురు సుమారు లక్ష ఓట్లు, బరిలో నిలిచిన 53 మంది కలిపి 10వేల లోపు ఓట్లు మాత్రమే సాధించారు. దీంతో మూడోస్థానంలో నిలిచే అభ్యర్థి ఎవరనే దానిపై ఎమ్మెల్సీ ఫలితం ఆధారపడి ఉంటుందని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

**కౌంటింగ్ వివరాలు:**

మొత్తం ఓట్లు (పోస్టల్ ఓట్లతో కలిపి) 2,52,100

చెల్లని ఓట్లు : 28,000(11.01శాతం)

చెల్లుబాటైనవి : 2,24,000

విన్నింగ్ కోటా ఓట్లు 1,12,001(సుమారు)

బరిలో నిలిచిన అభ్యర్థులు : 56

**ఎవరికీ దక్కని గెలుపు కోటా ఓట్లు**
పోస్టల్ ఓట్లతో కలిసి మొత్తం 2,52,100 ఓట్లు పోలవగా, అందులో సుమారు 28 వేల ఓట్లు చెల్లనివిగా అధికారులు నిర్ధారించారు. చెల్లనిఓట్లు పోగా మిగిలిన 2,24,000 ఓట్లలో సగం ఓట్లు.. అంటే.. 1,12,001 (సుమారు) ఓట్లను విన్నింగ్ కోటా ఓట్లుగా నిర్ధారించారు. పోటీలో ఉన్న ఒక్కో అభ్యర్థి నేరుగా కోటా ఓట్లను సాధించే పరిస్థితి కానరావడం లేదు. దీంతో తక్కువ ఓట్లు వచ్చిన అభ్యర్థులను ఎలిమినేషన్ చేస్తూ రెండో ప్రాధాన్యత ఓట్ల లెక్కింపుతో ఫలితం తేలనుంది. ఈ ప్రక్రియ పూర్తిచేసి ఫలితం తేలేందుకు బుధవారం రాత్రి వరకూ సమయం పట్టే అవకాశం ఉందని అభ్యర్థులు అంచనా వేస్తున్నారు.

**ప్రతీ రౌండ్‌లో బీజేపీకే ఆధిక్యం**
మొత్తం 21 టేబుళ్ల ద్వారా 12 రౌండ్లలో ఓట్ల లెక్కింపు ప్రక్రియ కొనసాగిస్తున్నారు. మొదటి రౌండ్‌లో బీజేపీ అభ్యర్థికి కాంగ్రెస్ అభ్యర్థిపై 36 ఓట్ల మెజార్టీ వచ్చింది. రెండోరౌండ్‌లో 1,457 ఓట్ల మెజార్టీ, మూడోరౌండ్‌లో 3,005 ఓట్లు, నాలుగో రౌండ్‌లో 1,263 ఓట్లు, ఐదోరౌండ్‌లో 1,381 ఓట్ల మెజార్టీ వచ్చింది. 6వ రౌండ్లో కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్ రెడ్డి బీజేపీ అభ్యర్థిపై 211 ఓట్ల మెజార్టీ సాధించారు. మొత్తంగా మంగళవారం అర్ధరాత్రి 12 గంటల వరకు 45,401 ఓట్లు సాధించి, ప్రత్యర్థులపై 6,931 ఓట్ల మెజార్టీతో అంజిరెడ్డి ముందంజలో ఉన్నారు. 38,470 ఓట్లతో నరేందర్‌రెడ్డి రెండో స్థానంలో, 3,1481 ఓట్లతో ప్రసన్నహరికృష్ణ మూడోస్థానంలో నిలిచారు. మందకొడిగా సాగుతున్న కౌంటింగ్ ప్రక్రియకు తోడు పోటాపోటీగా అభ్యర్థులు ఓట్లు సాధిస్తుండటంతో రౌండ్ రౌండ్‌కూ ఉత్కంఠ పెరుగుతోంది. రెండోప్రాధాన్యత ఓట్లపైనే బీజేపీ, కాంగ్రెస్ అభ్యర్థులు ఆశలు పెట్టుకున్నారు.

## 'ఎమ్మెల్సీ ఫలితాలు కాంగ్రెస్‌కు చెంపపెట్టు'
**ఆసిఫాబాద్‌అర్బన్:** ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలు కాంగ్రెస్ ప్రభుత్వానికి చెంపపెట్టులా ఉన్నాయని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ధోని శ్రీశైలం పేర్కొన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ బలపరిచిన మల్క కొమురయ్య గెలుపొందడంతో మంగళవారం జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ చౌక్ వద్ద పార్టీ సీనియర్ నాయకుడు అరిగెల నాగేశ్వర్‌రావ్‌తో కలిసి సంబురాలు నిర్వహించారు. పటాకులు కాల్చి, స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం తన నివాసంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, నిరుద్యోగులతోపాటు ప్రజలను కాంగ్రెస్ మోసం చేస్తోందని ఆరోపించారు. సీఎం, మంత్రులు పాలన పక్కనబెట్టి ఆధిపత్యం కోసం పాకులాడుతున్నారని ఎద్దేవా చేశారు. దేశంలో ప్రధాని మోదీ చేపడుతున్న సంస్కరణలకు ప్రజలు ఆకర్షితులై బీజేపీ వైపు చూస్తున్నారని పేర్కొన్నారు. భావితరాల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని ఉపాధ్యాయులు, మేధావులు ముందుచూపుతో బీజేపీ బలపరిచిన టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి మల్క కొమురయ్యను గెలిపించారని తెలిపారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ బీజేపీ అభ్యర్థి చిన్నమైల్ అంజిరెడ్డి విజయం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మల్లికార్జున్, నాయకులు మురళి, జయరాజ్, పెంటయ్య, అశోక్, శ్రీకాంత్, సుగుణాకర్, ప్రసాద్‌గౌడ్, వెంకన్న, మధు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### కారు బోల్తా.. నలుగురికి తీవ్రగాయాలు

నేరడిగొండ(బోథ్‌): మండలంలోని చించోలి అంతర్రాష్ట్ర రహదారి సమీపంలో కారు బోల్తా పడిన ఘటనలో నలుగురికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల మేరకు నిర్మల్‌ జిల్లా తానూర్‌ మండలం ఝరి(బి) గ్రామానికి చెందిన మదన్‌, సుజాత, రాధ, లింగవ్వ, వేదాన్ష్‌ సోమవారం బజార్‌హత్నూర్‌లో జరిగిన శుభకార్యానికి కారులో వెళ్లారు. మంగళవారం ఉదయం తిరుగు ప్రయాణంలో చించోలి గ్రామ సమీపంలోకి రాగానే కారు అదుపు తప్పి బోల్తా పడింది. సుజాత, రాధ, లింగవ్వ, వేదాన్ష్‌కు తీవ్రగాయాలు కావడంతో ముందుగా బోథ్‌ ప్రభుత్వ ఆస్పత్రికి, అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం నిర్మల్‌కు తరలించారు.

### మూడు ఆలయాల్లో చోరీ

జన్నారం: మండలంలోని తిమ్మాపూర్‌ శ్రీ రామచంద్రస్వామి ఆలయంతో పాటు పక్కనే ఉన్న సత్యనారాయణస్వామి, శివాలయంలో సోమవారం రాత్రి చోరీ జరిగినట్లు గ్రామస్తులు తెలిపారు. ఆలయాల్లో హుండీలను పగుల కొట్టి నగదును అపహరించుకుపోయినట్లు వారు పేర్కొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు కమ్మల భూమయ్య, శ్రీనివాస్‌ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

### ఇసుక ట్రాక్టర్‌ పట్టివేత

తాండూర్‌: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను మంగళవారం పట్టుకున్నట్లు జిల్లా మైనింగ్‌ శాఖ అధికారి జగన్మోహన్‌ రెడ్డి తెలిపారు. టేకులపల్లి నుంచి తాండూర్‌ మండలం అచ్చులాపూర్‌ గ్రామానికి ఇసుకను అనుమతి లేకుండా తీసుకువస్తుండగా పక్కా సమాచారంతో పట్టుకున్నామని, సదరు ట్రాక్టర్‌ను విచారణకోసం రెవెన్యూ శాఖ అధికారులకు అప్పగించినట్లు ఆయన పేర్కొన్నారు.

### పశువుల కొట్టం దగ్ధం

దహెగాం: మండలంలోని బొర్లకుంటలో సానులే పోశన్నకు చెందిన పశువుల కొట్టం మంగళవారం ప్రమాదవశాత్తు దగ్ధమైంది. కొట్టంలో ఉన్న కేసింగ్‌ పైపులు రెండు, ఆయిల్‌ ఇంజన్‌ పైపులు ఇరవై, పశుగ్రాసం పూర్తిగా కాలిపోయిందని బాధిత రైతు పేర్కొన్నాడు. సుమారు లక్ష వరకు ఆస్తి నష్టం వాటిల్లిందని వాపోయాడు. రెవెన్యూ అధికారులకు సమాచారం అందించడంతో ఆర్‌ఐ శృతి పంచనామా నిర్వహించారు.

### గంజాయి కేసులో ఏడేళ్ల జైలు

ఆసిఫాబాద్‌అర్బన్‌: గంజాయి సాగు చేసిన కేసులో ఒకరికి ఏడేళ్ల జైలుశిక్షతో పాటు రూ.50వేల జరిమానా విధిస్తూ మంగళవారం జిల్లా సెషన్స్‌ కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎంవీ రమేశ్‌ తీర్పునిచ్చినట్లు సిర్పూర్‌ (యూ) ఎస్సై రామకృష్ణ తెలిపారు. గతంలో విధులు నిర్వహించిన ఎస్సై విష్ణువర్ధన్‌ 2021 అక్టోబర్‌ 24న మధుర తాండ గ్రామ శివారులో పత్తి చేనులో తనిఖీ నిర్వహించగా భానుదాస్‌ పత్తి చేనులో గంజాయిని సాగు చేసినట్లు పేర్కొన్నారు. అప్పటి ఎస్‌హెచ్‌ఓ గంగారం కేసు నమోదు చేశారు. నేరం రుజువు కావడంతో నిందితుడు భానుదాస్‌కు పైవిధంగా శిక్ష ఖరారు చేస్తూ తీర్పునిచ్చినట్లు ఆయన పేర్కొన్నారు.



# పత్తి రైతుకు టీఆర్‌ తిప్పలు..!

- కౌలు రైతులకు దళారులే దిక్కు
- మద్దతు ధర దక్కక నష్టం

మంచిర్యాలఅగ్రికల్చర్‌: జిల్లాలో కొద్ది రోజులుగా టెంపరరీ రిజిస్ట్రేషన్‌(టీఆర్‌) పత్రాల జారీ నిలిపివేతతో కౌలు రైతులు దళారులను ఆశ్రయించి నష్టపోవాల్సి వస్తోంది. వ్యవసాయ అధికారులు ధ్రువీకరణ పత్రాలు ఇస్తున్నా మార్కెట్‌ అధికారులు టీఆర్‌ పత్రాలు ఇవ్వడం లేదు. దీంతో సీసీఐ కొనుగోలు కేంద్రంలో పత్తి కొనుగోలుకు అధికారులు నిరాకరిస్తున్నారు. ఫలితంగా మద్దతు ధర దక్కకుండా పోతోంది. జిల్లాలోని చెన్నూర్‌, బెల్లంపల్లి, లక్సెట్టిపేట మార్కెట్‌ యార్డు పరిధిలోని జిన్నింగ్‌ మిల్లుల్లో సీసీఐ ఆధ్వర్యంలో ఎనిమిది కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. మార్కెటింగ్‌ అధికారులు జనవరి 10 వరకు టీఆర్‌ పత్రాలు జారీ చేశారు. రెండు నెలల్లో గతేడాది కంటే అధికంగా పత్తి రావడం, కొనుగోళ్లపై ఆరోపణల నేపథ్యంలో విజిలెన్స్‌ అధికారులు విచారణ చేపట్టారు. మార్కెటింగ్‌ అధికారులు దళారులతో కుమ్మక్కై టీఆర్‌ పత్రాలు జారీ చేసి కొనుగోళ్లలో అక్రమాలకు పాల్పడ్డారని చెన్నూర్‌ మార్కెట్‌ కమిటీ కార్యదర్శి రామాంజనేయులును సస్పెండ్‌ చేశారు. జిల్లాలో 90శాతం కొనుగోలు చేయడం జరిగిందని సీసీఐ జనవరిలో 13రోజుల పాటు కొనుగోలు కేంద్రాలు మూసివేసింది. సాగు లక్ష్యం మేరకు కొనుగోలు జరిగిందని కేంద్రాల ఎత్తివేతకు సిద్ధమైంది. దీంతో రైతులు పది రోజుల పాటు మిల్లుల వద్ద పడిగాపులు కాస్తూ.. రాస్తారోకోలు చేపట్టారు. పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణ కేంద్ర మంత్రుల దృష్టికి తీసుకెళ్లడంతో తిరిగి కొనుగోలు చేపట్టారు. కానీ టీఆర్‌ పత్రాలు జారీ చేయకపోవడంతో ప్రైవేటు వ్యాపారులకు మద్దతు ధర కంటే రూ.500 నుంచి రూ.800 తక్కువకు విక్రయించి నష్టపోతున్నారు.

**ఇళ్లలోనే 25 శాతం నిల్వలు**

జిల్లాలో 1.56 లక్షల ఎకరాల్లో పత్తి సాగైంది. 12లక్షల నుంచి 13 లక్షల క్వింటాళ్ల దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేశారు. కానీ వాతావరణ పరిస్థితులు అనుకూలించక 10 లక్షల నుంచి 11లక్షల క్వింటాళ్లకు దిగుబడి పడిపోయినట్లు తెలుస్తోంది. జిల్లాలో ఇప్పటివరకు సీసీఐ 7,03,863 క్వింటాళ్లు, ప్రైవేటు వ్యాపారులు 95,176 క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేశారు. రైతులు సొంతభూమితో పాటు 30 ఎకరాల వరకు కౌలుకు తీసుకుని సాగు చేసిన వారూ ఉన్నారు. సాగు ఆలస్యం కావడం, కూలీల కొరత కారణంగా కొందరు ఫిబ్రవరిలో రెండో విడత పత్తితీత చేపట్టారు. ఆలస్యంగా దిగుబడి వచ్చిన రైతులు పత్తిని అమ్ముకోవడానికి ఇబ్బందులు పడుతుండగా.. 25శాతం నిల్వలు ఇళ్లలోనే ఉన్నాయి. కౌలు రైతులకు వ్యవసాయ అధికారి ధ్రువీకరణ పత్రం, మార్కెట్‌ కమిటీ కార్యదర్శి టీఆర్‌ పత్రం ఇస్తేనే సీసీఐ కొనుగోలు చేస్తుంది. టీఆర్‌ పత్రాలు దళారులకు ఇవ్వడంతో ఇతర జిల్లాలు, మహారాష్ట్ర నుంచి వేల క్వింటాళ్ల పత్తి సీసీఐకి విక్రయించినట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఒక్క చెన్నూర్‌ మార్కెట్‌ పరిధిలోనే టీఆర్‌ పత్రాల ద్వారా రూ.80 లక్షల విలువైన పత్తి విక్రయాల్లో అక్రమాలు చోటు చేసుకున్నట్లు తెలుస్తోంది. విచారణ కొనసాగుతుండగా.. చెన్నూర్‌, బెల్లంపల్లి, లక్సెట్టిపేట మార్కెట్‌ కమిటీ పరిధిలోనూ ఆరోపణలు ఉన్నాయి.


నెన్నెలలో కౌలు రైతు ఇంటి వద్ద ఉన్న పత్తి

**వారి తప్పిదం.. వీరికి శాపం**

మార్కెట్‌ కమిటీ అధికారుల తప్పిదాలతో కౌలురైతులకు తిప్పలు తప్పడం లేదు. భూయజమానికి కౌలు ఒప్పందం ప్రకారం ఎకరానికి రూ.12వేల నుంచి రూ.15వేల వరకు సీజన్‌కు ముందే మే నెలలో కౌలు చెల్లించారు. కౌలు ధ్రువీకరణ పత్రాలతో అమ్ముకునే వెసులుబాటు ఉంటుందని భావించారు. కానీ టీఆర్‌ ఇవ్వకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. భూ యజమాని పత్రాలతో విక్రయించాలంటే భూ యజమాని కొనుగోలు కేంద్రానికి రావాలి, తూకం వేసే వరకు ఉండాలి, ఫొటో దిగాలి, వచ్చే నగదు అతడి ఖాతాలోనే జమ అవుతుంది. గ్రామాల్లో భూములు ఉంటే పట్నంలో ఉద్యోగాలు, వ్యాపారాల్లో ఉన్న భూయజమానిని కొనుగోలు కేంద్రానికి తీసుకు రావడం, అమ్మిన పైసలు రావాలంటే కౌలు రైతుకు కత్తిమీద సాములాగా మారుతోంది. టీఆర్‌ పత్రాలు అందించి పత్తి కొనుగోలు చేయాలని కౌలు రైతులు కోరుతున్నారు.

**నెల రోజులుగా ఇంటి వద్దే..**



నా భూమి ఆరెకరాలతోపాటు మరో 20 ఎకరాలు కౌలుకు తీసుకొని పత్తి సాగు చేసిన. మహారాష్ట్ర, బీహార్‌ నుంచి కూలీలను రప్పించి పత్తి తీయించాను. ఫిబ్రవరి మొదటి వారం వరకు రెండో విడత ఏరడం పూర్తయింది. వ్యవసాయ అధికారి కౌలు ధ్రువీకరణ పత్రం ఇచ్చినా మార్కెట్‌ కమిటీ అధికారులు టీఆర్‌ ఇవ్వడం లేదు. నెల రోజులుగా పత్తి ఇంటి వద్దనే ఉంది.

– తోట మధు, రైతు, నెన్నెల

**అమ్ముకునుడెట్లా..**



పది ఎకరాలు కౌలుకు తీసుకుని పత్తి సాగు చేసిన. సంక్రాంతి నుంచి సీసీఐ పదిహేను రోజులు బంద్‌ చేసింది. తర్వాత ప్రారంభించి కొనుగోలు చేస్తుంది. మార్కెట్‌ అధికారులు టీఆర్‌ ఇవ్వడం లేదు. ప్రైవేటు వ్యాపారులు రూ.6700 వరకు అడుగుతున్నారు. ఈ ధరకు అమ్ముకుంటే కౌలుకు భూమి తీసుకొని సాగు చేసిన నష్టపోవుడే ఉంది.

– గంగిశెట్టి తిరుపతి, రైతు, నెన్నెల

## శిక్షణ సద్వినియోగం చేసుకోవాలి

ఆదిలాబాద్‌టౌన్‌: నూతనంగా నియామకమైన ఉపాధ్యాయులు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ఆదిలాబాద్‌ జిల్లా విద్యాశాఖ అధికారి ప్రణీత అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ గెజిటెడ్‌ నం.1 పాఠశాలలో డీఎస్సీ 2024 ద్వారా నియామకమైన ఉమ్మడి జిల్లా పరిధిలోని 300 మంది ఎస్‌ఏలకు వృత్యంతర ప్రేరణ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ ఉపాధ్యాయులు పుస్తకాలను సమర్థవంతంగా ఉపయోగించి విద్యాబోధన చేయాలన్నారు. విద్యా ప్రమాణాలను మెరుగుపర్చి మంచి ఫలితాలు సాధించాలన్నారు. రూపకార, సమీకృత అంచనాలు, డిజిటల్‌ కాంటెంట్‌, ఎఫ్‌ఎల్‌ఎన్‌, స్కూల్‌ ఎడ్యుకేషన్‌ యాప్‌, యూడైస్‌ తదితర కార్యక్రమాల గురించి అవగాహన కల్పించారు. ప్రభుత్వ పాఠశాల నం.2లో బయోసైన్స్‌, బాలక్‌ మందిర్‌లో గణితం, హిందీ, ప్రభుత్వ బాలికల పాఠశాలలో తెలుగు, ఇంగ్లిష్‌, గెజిటెడ్‌ నం.1లో సాంఘిక శాస్త్రం, సరస్వతినగర్‌ పాఠశాలలో ఫిజికల్‌ సైన్స్‌ శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సెక్టోరల్‌ అధికారులు సుజాత్‌ఖాన్‌, నారాయణ, శ్రీకాంత్‌, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఆదిలాబాద్‌ డీఈవో ప్రణీత

## ఆర్జీయూకేటీలో ‘కథక్‌’ శిబిరం

బాసర: స్పిక్‌ మేకే హెరిటేజ్‌ క్లబ్‌ ఆధ్వర్యంలో ఐదు రోజులపాటు నిర్వహించనున్న కథక్‌ నృత్య శిబిరాన్ని మంగళవారం ఆర్జీయూకేటీలో ప్రారంభించారు. మార్చి 4 నుంచి 8 వరకు నిర్వహించనున్న శిబిరంలో హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ కథక్‌ నృత్యకారిణి శ్రీమతి ఆర్తి శంకర్‌, శ్రీమతి రచన విద్యార్థులకు శిక్షణ ఇవ్వనున్నారు. ఈ సందర్భంగా ఆర్జీయూకేటీ వీసీ గోవర్ధన్‌ మాట్లాడుతూ కనుమరుగవుతున్న సాంస్కృతిక కళలను ఆర్జీయూకేటీ విద్యార్థులకు అందిస్తున్నందుకు అభినందించారు. శిబిరంలో శిక్షణ పొందిన 60 మంది విద్యార్థులు అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మార్చి 8న సాక్‌ ఆడిటోరియంలో ప్రదర్శించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్పిక్‌ మేకే హెరిటేజ్‌ క్లబ్‌ ఆర్జీయూకేటీ బాసర కోఆర్డినేటర్‌ డా.రాకేష్‌ రెడ్డి, అసోసియేట్‌ డీన్‌ డాక్టర్‌ విఠల్‌, తదితరులు పాల్గొన్నారు.


నృత్య శిబిరంలో పాల్గొన్న విద్యార్థులు

## విద్యార్థులు క్రీడానైపుణ్యం ప్రదర్శించాలి

బాసర: విద్యార్థులు క్రీడా నైపుణ్యం ప్రదర్శించాలని ఆర్జీయూకేటీ వైస్‌ చాన్స్‌లర్‌ ప్రొఫెసర్‌ గోవర్ధన్‌ అన్నారు. మంగళవారం బాసర ఆర్జీయూకేటీలో ఫిజికల్‌ ఎడ్యుకేషన్‌ విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అథ్లెటిక్స్‌ క్రీడా పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశ్వవిద్యాలయ స్పోర్ట్స్‌ డేలో భాగంగా 30 అథ్లెటిక్స్‌ క్రీడా పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏవో రణధీర్‌ సాగి, స్పెషల్‌ ఆఫీసర్‌ ప్రభాకర్‌ రావు, పీడీలు రవికిరణ్‌, శ్యాంబాబు, పీఈటీలు రఘువీర్‌, వసంత, స్వప్న పాల్గొన్నారు.


పోటీలు ప్రారంభిస్తున్న వీసీ గోవర్ధన్‌

## వివాహిత హత్య కేసులో భర్త అరెస్టు

పెంచికల్‌పేట్‌: మండలంలోని లోడుపల్లి గ్రామానికి చెందిన గుర్లె లలితను ఈ నెల 2న ఆదివారం ఆమె భర్త గణేశ్‌ హత్య చేసినట్లు కాగజ్‌నగర్‌ రూరల్‌ సీఐ శ్రీనివాసరావు తెలిపారు. పెంచికల్‌పేట్‌ పోలీస్‌ స్టేషన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ మాట్లాడుతూ కొద్ది రోజులుగా గణేశ్‌ భార్యపైన అనుమానంతో వేధింపులకు పాల్పడుతున్నాడు. వ్యవసాయ పనులకు వెళ్లిన దంపతులు ఆదివారం గ్రామ సమీపంలోని పంట చేనులో గొడవపడ్డారు. భార్య ఎదురుతిరగడంతో కోపంతో చాతిపైన కొట్టడంతో లలిత కింద పడిపోయింది. వెంటనే తన మెడలో ఉన్న తువ్వాలు మొఖం మీద కప్పి ముక్కు, నోరు మూయడంతో ఊపిరాడక మృతి చెందింది. మృతురాలి తల్లి తాను బాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితుడిని ఎల్కపల్లి బస్టాండ్‌లో అరెస్టు చేశారు. హత్యకు ఉపయోగించిన తువ్వాలను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు ఆయన పేర్కొన్నారు. ఎస్సై కొమురయ్య, సిబ్బంది పాల్గొన్నారు.


వివరాలు వెల్లడిస్తున్న సీఐ శ్రీనివాసరావు

## ఆర్థిక ఇబ్బందులతో ఒకరు బలవన్మరణం

తాంసి(బోథ్‌): ఆర్థిక ఇబ్బందులతో పురుగుల మందు తాగి ఒకరు బలవన్మరణం చెందిన సంఘటన భీంపూర్‌ మండలంలోని పిప్పల్‌కోటిలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన గొంటిముక్కుల విలాస్‌ (42) వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో రూ.2 లక్షల వరకు అప్పులు చేశాడు. తీర్చేమార్గం కనిపించకపోవడంతో కొంతకాలంగా మానసికంగా బాధపడుతున్నాడు. సోమవారం మధ్యాహ్నం ఇంట్లో నుంచి బయటకు వెళ్లి గ్రామ శివారులో పురుగుల మందు తాగాడు. ఎంతకూ ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు గాలించగా రాత్రి గ్రామ శివారులో మృతదేహం కనిపించింది. భీంపూర్‌ పోలీసులకు సమాచారం అందించడంతో మంగళవారం మృతదేహానికి పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌ ఆస్పత్రికి తరలించారు. మృతుని భార్య పుష్పలత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు స్టేషన్‌ హౌజ్‌ ఆఫీసర్‌ ముంతాజ్‌ తెలిపారు.


విలాస్‌ (ఫైల్‌)

### గోదావరిలోపడి వ్యక్తి మృతి

లక్సెట్టిపేట(మంచిర్యాల): ప్రమాదవశాత్తు గోదావరిలో పడి ఒకరు మృతి చెందినట్లు ఎస్సై సతీశ్‌ తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని ముల్కల్లగూడెంకు చెందిన సత్యనారాయణ (44) కాగజ్‌నగర్‌లోని ఎస్సీ వసతిగృహంలో వాచ్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. సోమవారం రాత్రి ఇంటికి వచ్చిన ఆయన మంగళవారం ఉదయం గోదావరి నదిలో పుణ్యస్నానం ఆచరించేందుకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు నీటిలో పడిపోవడంతో మృతి చెందాడు. మృతుని భార్య సుమలత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

### రోడ్డు ప్రమాదంలో ఒకరు..

నస్పూర్‌: పట్టణ పరిధిలోని శ్రీరాంపూర్‌–బెల్లంపల్లి హైవే బైపాస్‌పై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందినట్లు ఎస్సై సుగుణాకర్‌ తెలిపారు. ఛత్తీస్‌గఢ్‌కు చెందిన భూపేందర్‌ సింగ్‌ (41)రామగుండం ఎన్టీపీసీలోని ఓ కంపెనీలో మేనేజర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. మంగళవారం మధ్యాహ్నం కారులో గోదావరిఖని వైపు నుంచి మందమర్రి వైపు వెళ్తుండగా సీసీసీ ముక్కిడి పోచమ్మ ఆలయం సమీపంలో అదుపుతప్పి ఎదురుగా వస్తున్న టిప్పర్‌ను ఢీకొట్టింది. దీంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని వద్ద లభించిన గుర్తింపు కార్డులో ఉన్న వివరాలు సేకరించి సమాచారాన్ని అతని కుటుంబ సభ్యులకు అందించారు. మృత దేహాన్ని మంచిర్యాల ఏరియా ఆస్పత్రిలో భద్రపర్చామని, కుటుంబ సభ్యులు వచ్చాక అప్పగిస్తామన్నారు.

### తప్పిన ప్రమాదం

దండేపల్లి: మండలంలోని మేదరిపేట గ్రామ పంచాయతీ కార్యాలయ ట్రాక్టర్‌ మంగళవారం ఆటోమేటిక్‌గా స్టార్టయి చెట్టును ఢీకొని ఆగిపోవడంతో ప్రమాదం తప్పింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు మల్టీపర్పస్‌ వర్కర్‌ ఇంటి సమీపంలో నిలిపి ఉంచిన ట్రాక్టర్‌లో ఆడుకుంటున్న పిల్లలు క్లచ్‌పై కాలుపెట్టడంతో ఆటోమేటిక్‌గా స్టార్టయిన ట్రాక్టర్‌ కొంతదూరం వెళ్లి పక్కనున్న చెట్టును ఢీకొట్టి ఆగిపోయింది. ఘటనలో ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదు.

### అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

పాతమంచిర్యాల: అంగన్‌వాడీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని సంఘం (సీఐటీయూ అనుబంధం) జిల్లా అధ్యక్షురాలు భానుమతి అన్నారు. మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ పలుమార్లు మంత్రులు, ఎమ్మెల్యేలకు వినతిపత్రాలు ఇచ్చినా సమస్యలు పరిష్కారం కావడం లేదన్నారు. సమ్మె సందర్భంగా ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్‌ చేశారు. సంఘం జిల్లా కోశాధికారి మహేశ్వరి, నాయకురాళ్లు పద్మ, సరిత, అనురాధ, సబిత, తదితరులు పాల్గొన్నారు.

### కేకేఓసీలో వోల్వో ఆపరేటర్‌కు గాయాలు

మందమర్రిరూరల్‌: మందమర్రి ఏరియాలోని కేకేఓసీలోని మట్టితీత పనుల వద్ద మంగళవారం జరిగిన ప్రమాదంలో వోల్వో ఆపరేటర్‌కు గాయాలయ్యాయి. ఓసీలోని ఓబీ తొలగింపు వద్ద మట్టితో నింపిన వాహనం ముందుకు వెళ్లే క్రమంలో బ్రేకులు ఫెయిల్‌ కావడంతో అక్కడే ఉన్న మరో వాహనాన్ని ఢీకొట్టడంతో అందులో ఉన్న ఆపరేటర్‌ రాజేశంకు గాయాలయ్యాయి. తోటి ఆపరేటర్లు రామకృష్ణాపూర్‌లోని సింగరేణి ఆస్పత్రికి తీసుకెళ్లగా మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌ ఆస్పత్రికి తరలించారు.

### మహిళపై కోతుల దాడి

బోథ్‌: మండల కేంద్రానికి చెందిన గంగమ్మపై మంగళవారం కోతులు దాడి చేశాయి. మందగా వచ్చిన కోతులు ఒక్కసారిగా ఆమెపై దాడి చేయడంతో గాయాలయ్యాయి. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే బోథ్‌ సీహెచ్‌సీకి తరలించారు.

### బాసరలో భారతీస్వామి పూజలు


పూజలో పాల్గొన్న భారతీస్వామి

బాసర: నిర్మల్‌ జిల్లా బాసర శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారిని మంగళవారం శ్రీచిదానంద ఆశ్రమ భువనేశ్వరి విజయవాడ పీఠం పీఠాధిపతి శ్రీ కమలానంద భారతీస్వామి దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు, వేద పండితులు వారికి ఘనస్వాగతం పలికారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు సంజీవ్‌ పూజారి, వేద పండితులు నవీన్‌ శర్మ పాల్గొన్నారు.

### పీడీఎస్‌ బియ్యం పట్టివేత

తాండూర్‌: ఆటోలో అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్‌ బియ్యాన్ని పట్టుకున్నట్లు టాస్క్‌ఫోర్స్‌ సీఐ రాజ్‌కుమార్‌ తెలిపారు. మంగళవారం రాత్రి బెల్లంపల్లి నుంచి తాండూర్‌ వైపు వెళ్తున్న ట్రాలీని బోయపల్లి బోర్డు వద్ద తనిఖీ చేయగా 30 క్వింటాళ్ల పీడీఎస్‌ బియ్యం లభ్యమైనట్లు ఆయన పేర్కొన్నారు. తాండూర్‌ మండలం తంగళ్లపల్లికి చెందిన దుర్గం శ్రీకాంత్‌, బుల్లి చందు, కునుగల తిరుపతిని అదుపులోకి తీసుకోగా గోవిందుల శ్రీనివాస్‌ పరారైనట్లు తెలిపారు.

### చింతగూడ అడవిలో మంటలు


మంటలు ఆర్పుతున్న సిబ్బంది

ఆదిలాబాద్‌రూరల్‌: మండలంలోని చింతగూడ అటవీ ప్రాంతంలో సోమవారం రాత్రి కార్చిచ్చు అంటుకుంది. ప్రజలు గమనించి అటవీ శాఖ, పోలీసులకు సమాచారం అందించారు. విషయం ఎస్పీ గౌస్‌ ఆలం దృష్టికి వెళ్లడంతో పోలీసులు, అగ్నిమాపక, అటవీ శాఖ అధికారులను అప్రమత్తం చేయడంతో మంటలు ఆర్పివేశారు. ఈ సందర్భంగా ఎఫ్‌ఆర్వో గులాబ్‌సింగ్‌ మాట్లాడుతూ రాలిపోయిన ఆకులకు నిప్పంటుకోవడంతో సుమారు 4 నుంచి 5 హెక్టార్ల వరకు మంటలు చెలరేగడంతో సిబ్బందితో కలిసి ఆర్పివేశామన్నారు.

### సింగరేణి పాఠశాలలో నాణ్యమైన విద్య

మందమర్రిరూరల్‌: సింగరేణి పాఠశాలల్లో నాణ్యమైన విద్యాబోధన జరుగుతుందని సింగరేణి ఎడ్యుకేషన్‌ సెక్రెటరీ శ్రీనివాస్‌ అన్నారు. మందమర్రి ఏరియాలోని సింగరేణి హైస్కూల్‌ ప్రారంభించి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా మంగళవారం స్వర్ణోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంస్థకు చెందిన పాఠశాలల్లో చదివిన పూర్వ విద్యార్థులు అనేక రంగాల్లో రాణిస్తున్నారన్నారు. అనంతరం స్కూల్‌ ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో హెచ్‌ఎం పురుషోత్తం, సీసీసీ పాలిటెక్నిక్‌ కళాశాల ప్రిన్సిపాల్‌ నరసింహస్వామి, తదితరులు పాల్గొన్నారు.

## ఖి‘లేడి’ల అరెస్ట్‌

- ఆదిలాబాద్‌లో బంగారు ఆభరణాల చోరీ
- భర్తతోపాటు ఇద్దరు భార్యల తతంగం

ఆదిలాబాద్‌టౌన్‌: జల్సాలకు అలవాటు పడి సులభంగా డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో చోరీలకు పాల్పడుతున్న భర్తతో పాటు ఇద్దరు భార్యలను అరెస్టు చేసినట్లు టూటౌన్‌ సీఐ కరుణాకర్‌రావు తెలిపారు. మహారాష్ట్రలోని ఔరంగాబాద్‌ జిల్లా చికల్తానా గ్రామానికి చెందిన తేజ్‌ షిందేకు మైనా షిందే, జ్యోతి షిందే ఇద్దరు భార్యలు. ఫిబ్రవరి 23న మధ్యాహ్నం ఆర్టీసీ బస్టాండ్‌కు వచ్చారు. ఉట్నూర్‌ మండలంలోని నాగాపూర్‌కు చెందిన ఏరుకొండ లక్ష్మి తన స్వగ్రామానికి వెళ్లేందుకు బస్సు ఎక్కుతుండగా సహాయపడినట్లుగా ఆమె చేతిలో నుంచి బ్యాగు తీసుకున్నారు. మీరు బస్సు ఎక్కండని చెప్పి బ్యాగులో ఉన్న ఆరు తులాల బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లారు. బాధితురాలు బ్యాగు చూసుకోగా ఆభరణాలు కన్పించకపోవడంతో ఆందోళనకు గురై టూటౌన్‌ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఇదిలా ఉండగా వన్‌టౌన్‌ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలోని అంబేడ్కర్‌చౌక్‌ ఏరియాలోని రాజరాజేశ్వరస్వామి బట్టల దుకాణంలో గంగమ్మకు చెందిన 19 గ్రాముల పుస్తెల తాడు ఎత్తుకెళ్లగా వన్‌టౌన్‌ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. మంగళవారం ఆదిలాబాద్‌ బస్టాండ్‌లో అనుమానాస్పదంగా తిరుగుతున్న మహిళలను పోలీసులు విచారించగా దొంగతనాలకు పాల్పడినట్లుగా అంగీకరించారు. వారి నుంచి మూడు గ్రాముల ఉంగరం స్వాధీనం చేసుకున్నారు. తేజ్‌ షిందే పరారీలో ఉన్నాడు. మిగతా బంగారం తమ భర్త వద్ద ఉందని ఆ మహిళలు చెప్పినట్లుగా సీఐ వెల్లడించారు. పట్టుకున్న వారిలో ఎస్సై విష్ణు ప్రకాష్‌ , సిబ్బంది బబిత, అనసూయ, సౌజన్య, నరేందర్‌ , కుంట ప్రవీణ్‌, తదితరులు ఉన్నారు.


పోలీసుల అదుపులో నిందితులు

## ‘ఓరియంట్‌’లో భద్రత వారోత్సవాలు

కాసిపేట: మండలంలోని దేవాపూర్‌ ఓరియంట్‌ సిమెంట్‌ కంపెనీలో మంగళవారం భద్రత వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా యూనిట్‌ హెడ్‌ బాలగిరిధర్‌ భద్రత జెండా ఆవిష్కరించారు. అనంతరం డీఏవీ పాఠశాల విద్యార్థులకు, ఉద్యోగులకు, కార్మికులకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఈ నెల 4 నుంచి 10 వరకు నిర్వహించనున్న కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్మికులతో భద్రత ప్రతిజ్ఞ చేయించారు. ఈకార్యక్రమంలో కంపెనీ సీనియర్‌ జీఎం ఆనంద్‌ కులకర్ణి, డీఏవీ ప్రిన్సిపాల్‌ కిరణ్‌, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.


ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, కార్మికులు

## సోలార్‌ పవర్‌ప్లాంట్లకు స్థల పరిశీలన

నెన్నెల / దండేపల్లి: మహిళా స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో సోలార్‌ విద్యుత్‌ ఉత్పత్తి కేంద్రాల ఏర్పాటుకు కేటాయించిన స్థలాలను రెడ్‌కో సంస్థ మేనేజర్‌ శ్రీమన్నారాయణ, డీఆర్‌డీవో కిషన్‌ మంగళవారం పరిశీలించారు. నెన్నెల శివారులోని సర్వేనంబరు 671లో నాలుగు ఎకరాలు సోలార్‌ పవర్‌ ప్లాంటు ఏర్పాటుకు కేటాయించారు. ఒక మెగావాట్‌ ఉత్పత్తి సామర్థ్యంతో సోలార్‌ పవర్‌ ప్లాంటు ఏర్పాటుకు అనుకూలంగా ఉందని, రెండు కిలోమీటర్ల దూరంలోనే 33/11కేవీ విద్యుత్‌ సబ్‌స్టేషన్‌ ఉండడంతో ఉత్పత్తి చేసిన విద్యుత్‌ విక్రయానికి ఎలాంటి ఇబ్బందులు ఉండవని అధికారులు పేర్కొన్నారు. ప్లాంట్ల ఏర్పాటుతో మహిళలు పారిశ్రామిక వేత్తలుగా ఎదిగే అవకాశం ఉందన్నారు. సెర్ప్‌ ద్వారా మహిళా సంఘాలకు రుణాలు అందించనున్నట్లు తెలిపారు. దండేపల్లి మండలం వెల్గనూర్‌ గ్రామ పంచాయతీ పరిధి అందుగులపేటలో స్థలాన్ని పరిశీలించారు. నాలుగు ఎకరాల స్థలంలో రూ.3కోట్లతో సోలార్‌పవర్‌ ప్లాంటు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నెన్నెల ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి, డీపీఎం సంజీవ్‌, ఏపీఎంలు విజయలక్ష్మి, పంజాల ప్రకాష్‌గౌడ్‌, ఏపీవో నరేష్‌, ఎంఆర్‌ఐ సులోచన, దండేపల్లి ఎంపీడీవో ప్రసాద్‌, ఆర్‌ఐ భూమన్న, విద్యుత్‌ ఏఈ బాపు, ఏపీఎం బ్రహ్మయ్య, ఏపీవో దుర్గాదాస్‌, తదితరులు పాల్గొన్నారు.


దండేపల్లి: స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

## బడ్జెట్‌పై సెమినార్‌

పాతమంచిర్యాల: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై మంగళవారం జిల్లా కేంద్రంలోని చార్వాక భవన్‌లో సీపీఎం ఆధ్వర్యంలో సెమినార్‌ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ రాష్ట్ర నాయకులు ప్రసాద్‌, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి వెంకట్రాములు మాట్లాడుతూ ఫిబ్రవరిలో కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌ ప్రవేశపెట్టిన బడ్జెట్‌తో బీజేపీ ప్రభుత్వ కార్మిక వ్యతిరేఖ వైఖరి వెల్లడైందన్నారు. దేశంలోని సామాన్య ప్రజలు, కార్మికులపై మోయలేని భారం మోపుతూ కార్పొరేట్లకు ఊడిగం చేసేలా బడ్జెట్‌ ఉందన్నారు. బడ్జెట్‌కు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకురాలు శారద, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు సంకె రవి, కార్యదర్శి అశోక్‌, నాయకులు లింగన్న, ప్రకాశ్‌, దూలం శ్రీనివాస్‌, అశోక్‌, తదితరులు పాల్గొన్నారు.